# కవితా కౌముది

## తడిపక్షి

కొండూరు కృష్ణ

గది మధ్యలో  ఓ దీపం
ప్రక్కగా  పూలసజ్జ

వెలుగునోడుతూ  కిటికీ..
జారిన ఊలు ఉండ పరుగెడుతూ ..



ఓ పక్షి ఆరుబయట జోరు వానలో
రెక్కలార్చుకుంటూ..

మసక వెలుతురులో
తావి ఆఘ్రాణిస్తూ ..
కాసే చేతులను చూస్తోంది .

ఇంతలో
వెలుగు నిట్టూర్పు, మసివాసన,
కట్టెగా  మిగిలిన ఊలు ఉండ.
రెక్కల బరువుతో
కాళ్లక్రింద నింగిని చూస్తూ ..
తడిపక్షి !!

★★★

# అమ్మ పాడని పాట

ఆచాళ్ళ శ్రీనివాసరావు

మూడు ముళ్ళతో ముడిపడ్డ బంధం నా వెంటా
ఏడు అంగలేసి అడుగెట్టినానూ మీ ఇంటా..
ఆలినయ్యాను మీ అయ్యకు
కోడలినయ్యా వాళ్ళమ్మకి అమ్మనయ్యాను
అత్తనయ్యాను అమ్మమ్మనయ్యాను నాన్నమ్మనయ్యాను
అవ్వనయ్యానూ
అన్నీ అయినేను....
తిరిగి చూసుకుంటె ఒంటిగానె మిగిలి ఉన్నానూ ॥

పంచ ప్రాణాలైన బిడ్డలెదిగాక
కష్టాలు కడతేరు ఆశపుట్టాక
దేవుడెత్తుకు పోయే పసుపు కుంకాలూ
దారి చూసుకు పోయె కన్న ప్రాణాలు
పోయిన వారితో పోలేదు ప్రాణం
ఎదిగిన మీ కాడ ఒదగని ప్రాయం
పొద్దుగూకితే చాలు ఏకాకి చీకట్లు
నల్ల మబ్బల్లే బరువెక్కి నా కళ్ళు
గుండెలోతుల కురిసె దిగులు వానల్లు
గుండె లోతుల కురిసె దిగులు వానల్లు
మూడు ముళ్ళతో ముడి పడ్డ బంధం నా వెంటా...
ఏడు అంగలేసి అడుగెట్టినానూ మీ ఇంటా... ॥

కూడూ గూడూ గుడ్డ అయ్యే ఇచ్చి పోయె నగలూ నట్రా మీద
అక్కర లేదాయె
రోజుకొక్కసారి పలకరించండి
సాలు కొక్క సారి మీరొచ్చి పొండి
మీ పిల్లా పాపలతో మీరొచ్చి పొండి
మీ పిల్లా పాపలతో ఏడున్నగాని
పదిలంగా నూరేళ్ళు సల్లంగుండాల
పది మంది లో మంచి పేరు ఉండాల
పదిలంగా నూరేళ్ళు సల్లంగుండాల
పది మందిలో మంచి పేరు ఉండాలా
మూడు ముళ్ళతో ముడి పడ్డ బంధం నా వెంటా
ఏడు అంగలేసి
అడుగెట్టినానూ మీ ఇంటా .. ॥

★★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

కన్నులు చెమర్చు విరులకు నన్ను చూచి
కాంచు తరువులు నా స్థితి కరుణతోడ
కొమ్మలశ్రువుల్ కార్చు నాగూర్చి నేడు
వనము కురిపించు నాపైన కనికరమ్ము

పూలబాలలు వెదకు నా పొలతి కొరకు
దారులరయు వేరొక పదద్వయము కొరకు
మారుతము తిరుగాడు నా మార్గమందు
మగువపొలుపు దెలుపు పరిమళము కొరకు

కలసి నడచిన దారుల జ్ఞాపకములు
కలసి పలికిన పలుకుల కలకలములు
మరవజాలవీ వనములు మారుతములు
అరయు జాలితోనొంటరినైన నన్ను

ప్రకృతి పులకించు నిండుదంపతుల జూచి
మించుప్రియమున చెలగు ప్రేమికులజూచి
చెలియ వీడిన దవ్వైననిలను విడిన
కరుణ హెచ్చిలి కన్నీరు కార్చు ప్రకృతి

నడచుచుంటినొంటరిగనీ ఘడియయందు
కారునశ్రువులెప్పుడో తేరుకొందు
చెలిమి లోపించి బ్రతుకు నిర్జీవమైన
జీవరహితజీవితమెట్లొ చిగురు తొడుగు

COMMENTS